# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204265
UNIVERSAL LIBRARY

సారస్వత సేవాసమితి. ద్వితీయ ప్రచురణ.

# అహింస

గ్రంథకర్త:

ఎం. యస్. రాజలింగం బి. ఎస్సి.

ప్రతులు: 1000

పార్థివ విజయ దశమి.

1945

వెల: 0-6-0

సర్వస్వామ్యములు సమితివి.

శ్రీనివాస ప్రింటింగ్ వర్క్సు,
సికిందాబాదు

అక్టోబర్ 1945

# మనవి

శ్రీ "సారస్వత సేవాసమితి" యను పేర నొక సమితిని శ్రీ పార్థివ ఉగాదినాడు జాతీయ యువకులమంతా కలసి ఏర్పాటు చేసికొని సమితిపక్షమున ప్రథమ ప్రచురణ వివిధ రచనా సంపుటి "సేవాంజలి"ని పాఠకలోకానికి సమర్పించుకొన్నాం.

సారస్వతంగా సాయశక్తులా కృషియొనర్చుట సమితి కార్యక్రమం. మా కృషి పరీక్షించి, విమర్శించి, సరిదిద్ది ఆదరించుట పాఠకలోకంవంతు.

నిష్పాక్షికదృష్టితో యథార్థ విషయాలను ఘాటుగా విమర్శిస్తూ మాసమితి సారస్వతకన్యకకు అక్షతలుజల్లి పురోహితులై ఆశీర్వదించుట పత్రికా సంపాదకుల వంతు.

అషాఢమాసంవరకే మేము రెండవ ప్రచురణను పాఠకలోకానికి అందీయవలసియుండెను. కాని ఆర్థిక అవకతవకలవల్ల ఆలస్యమైనందులకు పాఠకులు మన్నింతురుగాక.

మేము కోరినంతమాత్రాన యీ "అహింస" పుస్తకాన్ని మా సమితిపక్షమున ప్రకటించుకొనుటకు సమ్మతించిన శ్రీ యం. యస్. రాజలింగంగారికి మేమెంతయు కృతజ్ఞులం. వారికి మాపైగల అవ్యాజానురాగము, మాకు వారిపైగల భక్తి విశ్వాసాలే కారణాలు.

ఈ ప్రచురణ సర్వజనాంగీకారయోగ్యతను సంపాదించి మా సమితికొక అలంకారంగా శోభిల్లుతుందని ఆశిస్తున్నాం. అట్టి నిర్ణయానికై పాఠకలోకానికే వదలిపెట్టాం.

ఈ పుస్తక ముద్రణకు శక్త్యానుసారం తోడ్పడ్డ శ్రీ సత్యనారాయణ మిల్లు, ఘనపురంవారికి మా కృతజ్ఞతలు.

ఇట్లు,
సారస్వత సేవాసమితి కార్యదర్శి.

---

## విజ్ఞప్తి

---

ఈ చిన్నిపుస్తకం గాంధీజీయొక్క అహింస అంటే "హింసకానిది అహింస" అనే నిర్వచనంపై ఆధారపడలేదని, అహింస అంటే విశ్వప్రేమఅని, అది బలవంతుల అహింస, బలహీనుల అహింస అని రెండువిధాలని పాఠకలోకానికి తెలియజేయటానికై సాధారణభాషలో వ్రాయబడింది.

పాఠకలోకం అహింసప్రయోగాన్నిగూర్చి తెలుసుకోవాలనే కుతూహలంతో కొన్ని సాదృశ్యాలీయబడ్డవి. వీటివల్ల తోటి సోదరులు దగినంతసేవ దేశానికి చేస్తారని విశ్వసిస్తూ విరమిస్తున్నాను.

ఇట్లు,
రచయిత

వందేమాతరం.

# అహింస

శంకర్

నీవు చాలా విశాలహృదయం కలవాడివి. అంతే గాదు నీబుద్ధి కుశలత చాలా అమోఘమైంది. నీవేదైనా విషయాన్ని సంతృప్తికరమైన జవాబు దొరికేదాకా, అంగీకరించే తత్వం కలవాడివి కాదు. అందుకోసమే నీయెదుట యీనూతన విష యాన్ని యుంచదలచా.

నీవు పూర్తిగా చర్చించుకొని, నిర్ణయానికిరా. నీనిర్ణయం మన మిత్రబృందానికి, అంటే మనశత్రువర్గానికి మార్గదర్శకం కాగలదని నానమ్మకం. అయితే విను. వేదాలు సృష్టిలోకి వచ్చి కొన్నికోట్ల వత్సరాలైనాయి. ఇలాఅంటే చరిత్రకా రులు ఆధునిక యువకులు చాలా కోపగిస్తారు. గుడ్లెఱ్ఱజేస్తారు. కాబట్టి కొంచెం రాజీపద్ధతితో మాట్లాడదలచా. అంటే సుప్రసిద్ధ చరిత్రకారులందరు ఒప్పుకున్న విధంగా, పదివేల సంవత్సరాలకిత్రం వేదాలు ఉన్నాయి.

పరిపూర్ణతా సిద్ధాంతం

ఈ వేదనాగరికతయే హైందవ నాగరికత. ఈ నాగరికతలోనే పరిపూర్ణ సిద్ధాంతం ఇమిడియుందని పలువురి పెద్దల అభిప్రాయం. నా విశ్వాసంకూడా. సిద్ధాంతం అర్థంచేసుకోవాలంటే పదనిర్వచనం అవసరంకదా! అయితే పరిపూర్ణత అంటే ఏమిటి? అని నీ వడుగవచ్చు. పరిపూర్ణత అనగా లోపాలులేకుండా వుండడం. అంటే యేవస్తువుకాని, లేక తత్వంకాని దానిపరిపూర్ణదశలో భగవత్స్వరూపాన్ని సూచిస్తాయి. నీవు ఆశ్చర్య పడుతావు యీమాటవింటే ఆశ్చర్యమేకాదు, నిరుత్సాహంకూడా కలుగుతుంది. అసత్యంకూడా పరిపూర్ణదశలో భగవత్స్వరూపమంటే నీహృదయంలో నాటుకపోయిన సత్యపదార్థపరిపూర్ణతే, భగవంతుడనే మూలసిద్ధాంతం దెబ్బతింటుంది. కుంటువడుతుంది. నిన్ను కలవరపెడుతుంది, పిచ్చివాణ్ణి చేస్తుంది అంతేకాదు సత్యాసత్యాలు పరిపూర్ణత భగవంతుడైతే మనవారు సత్యానికే ప్రాధాన్యత నెందుకిచ్చారు? అసత్యం తప్పు అని ఎందుకంటారు? అని నీకు సందేహంకూడా కలగవచ్చు, అది సహజం.

అసత్యం ప్రబోధం చేయరాదు

ఒకతత్వాన్ని ప్రబోధం చేయాలంటే, మొదట ఆతత్వం ప్రపంచమంతా పాటిస్తే శాంతి నిలుస్తుందా, అని ఆలోచించాలి. ఒకవేళ నిలుస్తే ఆతత్వం ప్రబోధంచేయాలి అయితే అసత్యాన్ని ప్రజలందరు పాటిస్తే చెప్పేదానికి, చేసేదానికి

సంబంధం యుండదుగదా! మరి అలాంటప్పుడు మానవులలో శాంతి యుంటుందా? ఉండదుగదా! మరియిక సత్యం ప్రజలంతా చెప్పతే నోటిమాటకు క్రియకు భేదం ఉంటుందా? ఉండదుగదా! అంటే సత్యంలోనే ప్రపంచశాంతి ఉందన్నమాట అందుకోసమే అసత్యప్రబోధాన్ని దూరంచేయాలి, సత్యం చెప్పాలి. అయితే అసత్యానికి పరిపూర్ణత ఎక్కడ? అదిలేనప్పుడు భగవత్స్వరూప మెలాతాలుస్తుంది? అని నీవు అడగవచ్చు. నిజం. పరిపూర్ణతఅంటే లోపంలేకుండా వుండడం అని తెలుసుకొన్నావుగదా! మరి అసత్యంలోని లోపమేమిటి? ఆలోపం లేకుండాచేయి. అప్పడు అసత్యం ఏమవుతుందో చూడు. సత్యమే అవుతుంది. కావుననే అసత్యంకూడా పరిపూర్ణదశలో భగవత్స్వరూపమన్నాను.

ఇక తత్వాన్ని ప్రబోధం చేసేవిషయంలో గుర్తించాల్సిన రెండవ విషయం ఆతత్వం మానవబలహీనతల నెదుర్కొని మనశ్శక్తిని యిచ్చేదిగా యుండాలి. ఉదాహరణంగా, అసత్యం చెప్పడం మానవ బలహీనతయని నీవు నేనుయొప్పకుంటాము. నైతికపతనం చెందుతూయున్న యీనాజుల్లో మానవుడు అసత్యం చెప్పడం తేలిక. సహజంకూడా ఐంది. ప్రాణాన్ని సౌఖ్యంగా విలాసాలతో (Luxuries) గడుపదలచినవానికి, అసత్యం ఎంత పెద్ద ఆయుధమో నీకు తెలియనిది గాదు. అసత్యం చెప్పడానికి ఒకపెద్ద మానసికశక్తి కావలసిన అవసరములేదు. కారణం బలహీనతను అలవాటు చేసుకోవడం

తేలిక. దిద్దుకోవడానికికదా శక్తి కావలసింది, ఔను. ఆదిద్దుకోవడంలోనే జీవనముంది. మానవత్వముంది. శాంతియుంది అట్టిశాంతికై పోయేశక్తి కావాలంటే, అసత్యాన్ని వదలి సత్యాన్ని అలవరచుకోవాలి. సత్యం చెప్పడంవస్తే మానసిక శక్తి పెరిగిందన్నమాట. ఈమానసిక శక్తియేకదా హిప్నొటిజము, మనోవశ్య తత్వశాస్త్రము, శక్తినిజూపేది

**మానసిక శక్తి యోగులు**

ఈమానసికశక్తి సాధించలేనిదేమిటి? అది వ్యాధుల నిమిషములో పోగొట్టవచ్చును. నిద్రించువారికి ఆజ్ఞలనిచ్చి నిద్ర లేవగనే మనము చెప్పినట్లే ఆజ్ఞప్రకారము పని ముగింపు చేయించవచ్చును ఎన్నిగంటలకు లేవవలెననిన అన్నిగంటలకు అలారము గడియారము లేకనే లేవవచ్చును. క్లోరోఫారము లేకనే శస్త్రచికిత్స చేయవచ్చును. 1000 మైళ్ళ దూరమందు జనముతో మాట్లాడవచ్చును. నిద్రింప చేయవచ్చును. భార్యాభర్తల మైత్రిని అభివృద్ధి చేయవచ్చును. రక్తప్రసార వేగమును తగ్గింపవచ్చును. తుట్టతుదకు మనిషి జీవనకాలమును పొడిగించవచ్చుగూడ! ఈలాంటి మనశ్శక్తితోనే నాగార్జునుడు 526 సంవత్సరములు జీవించెను. మన యోగీశ్వరులుగూడ యీశక్తిని కలిగియుండిరి. కాని రానురాను యీశక్తి మానవులలో క్షీణించింది. తత్ఫలితంగా అది సాధింపజాలని శక్తి అయింది. అందుకోసం నీవు, నేను పూర్వులుచేసిన మహోత్కృష్ట కార్యాల నన్నిటిని వెక్కిరింపసాగాము. లేదా పుక్కిటి పురాణాల ——ని త్రోసి

పుచ్చాము. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే సత్యాసత్యాలు రెండు వేరు వేరు వస్తువులు కావు. సత్యం దానియథార్థాన్నుంచి దూరంకావడమే అసత్యంగదా? ఆకళంకం తీసివేయి. ఈకళంకానికి ముఖ్యకారణం మనభాష, వేషం, సభ్యత, (సంస్కృతి) మరపింపజేసిన పరాధీనతయే. ఆపరాధీనత మనలనుపాశ్చాత్య వ్యామోహంలోకి దించింది. ఆవ్యామోహంలో స్వార్థానికి దారితీసే పాశ్చాత్యుల భౌతికశాస్త్రాలపై మనకు విశ్వాసం కలుగసాగింది. ఆవిశ్వాసానికి అంతులేదు. కారణంలేదు. పాశ్చాత్యులచే చెప్పబడే యేసిద్ధాంతమైనా ప్రజలు విశ్వసించారు. రానురాను మన మాతృభాషలలో చెప్పబడే సిద్ధాంతాల నమ్మికను, ఆదే ఇంగ్లీషుభాషలో చెప్పితే నమ్మేరోజులు వచ్చాయి. రామనాథం మన స్నేహితుడు. దేవుడంటేనమ్మడు. Nature నేచర్ అంటే నమ్ముతాడు. ఆలాగే రెడ్డి మన నాగపూరుమిత్రుడు. కామశాస్త్రం తప్పంటాడు. కాని గాంబర్సు శృంగార రచనల నమ్ముతాడు.

**మేలుకొలుపు**

ఈలాంటి స్థితిలోనే మనసంస్కృతిని మరవని పెద్దలు, పాశ్చాత్య వ్యామోహంలో బడ్డవారిని మేల్కొల్పి నీవు యితర సంస్కృతిలోనుంచి స్వీకరించే ప్రతి విషయం మనసంస్కృతిలో ఉందోలేదో చూడు. లేకపోతే ఆవిషయం అవసరమనిపిస్తే, మన వాతావరణంలో యిమిడగలుగుతే, గ్రహించు అని చెప్పసాగారు. ఠాగూరు మహాకవి అన్నవిధంగా "త్వరగా స్వీకరించిన పాశ్చాత్య సంస్కృతిని

భారతీయులు జీర్ణించుకోలేక కక్కసాగారు" దానికి ముఖ్య కారణం మనదేశాని కనుకూలించని పాశ్చాత్య స్త్రీ పురుషుల నైతిక దృక్పథమే. ఈస్థితిలోనే ప్రతివాడు మన యింటిబావిలో నీరు లేకపోతేనే, క్రొత్తబావి తవ్వాలి. లేకపోతే ఆబావినే వాడుకోవాలి. పాతది పనికివస్తే క్రొత్తబావి త్రవ్వాలా? అని ప్రశ్నించుకోవడం తటస్థించింది. అంతేగాక జీర్ణించిన పూరి గుడిసెలలో, మాడేరైతులో కల్పింపబడిన వృత్తి న్యూనతా చిహ్నంగా యున్న మాలవాడిలో, భరించరాని ఆర్థిక యిక్కట్టుల తెచ్చిన పాశ్చాత్య వ్యామోహావేశులగు స్త్రీ పురుషులలో, నామకః నిల్చిన పాశ్చాత్య వైవాహిక విధానంలో, బూడిద పూసుకొనిన నల్లని స్త్రీల ముఖాలలో, భారతీయ సంస్కృతి ఆశాజ్యోతి వెలుగసాగింది. ఆవెలుగును గుర్తించారు గాంధీ, పట్టాభి. ప్రకాశం, రాధాకిషన్ బోలు వ్యక్తులు ప్రబోధించారు. భారతలోకం నిద్రమేల్కాంచింది.

**ఆదర్శము కర్తవ్యము**

ఈ పవిత్రసమయంలో భారత నాగరికతలో సిద్ధాంతులు, ప్రచారం ప్రపంచశాంతికి దారితీసేవిగా, మానసిక శక్తిని యిచ్చేవిగా చేయబడ్డవని, అట్టి సిద్ధాంతం ఆచరణ సాధ్యమని ఋజువుచేయుటకు, కేవలము సిద్ధాంత ప్రాముఖ్యతను సాధించి, మరణించిన వ్యక్తుల ఆదర్శ జీవనాలు చెప్పబడ్డాయని, తుదకు సర్వసాధారణ మానవులు పాటించ వీలున్న సిద్ధాంతం యొక్క కనీసపు సరిహద్దులు నిర్ణయించబడినవని పెద్దలు చెప్పసాగారు. ఉదాహ

రణంగా సత్యం చెప్పడమనేది ఆదర్శము. అది అసంభవము గాదు. ఎందుకంటే హరిశ్చంద్రుడు, సత్యవంతుడు పాటించారు. ఇప్పటికి సజీవంగా వున్నారు. అయితే యీసంఖ్య చాలా కొద్ది అందరు దీన్ని సాధించలేరు. కాబట్టే అప్రియమైన సత్యం చెప్పవద్దనేది. సత్యసిద్ధాతం కనీసపు సరిహద్దుగా నిర్ణయించారు. ఈవిధంగా నీవు ఈసిద్ధాంతాన్ని గ్రహించినా, 1-వేద నాగరికతలో ఆదర్శ సిద్ధాంతం,2-దానిని సాధించిన ఆదర్శ మానవోత్తములు, 3- ఆసిద్ధాంతపు కనీసపు సరిహద్దులు నిర్ణయించబడ్డాయి.

ఈ సిద్ధాంతాలు చేసేటప్పుడు మానవులు నశించిన మానవత్వం నశించదని మానవత్వంలో తరచు ప్రవేశించే లోపాలు దూరముచేస్తూ కళంకితమగుతూయున్న మానవత్వాన్ని పరిపూర్ణదశకు తేవడమే మానవధర్మమని గుర్తించుకోబడింది.

**భారతసిద్ధాంతాలమార్పు ఎప్పుడుచేయాల**

ఆలాంటపుడు అనాదినుంచి వస్తూయున్న యేతత్వాన్నిగాని, యేసిద్ధాంతాన్నిగాని యేఆచారాన్నిగాని, ప్రపంచం వాటిని పాటించుటవల్ల లాభం లేకపోయినా, నష్టములేంది మార్పు చేయవద్దు. యెందుకంటె పదివేల సంవత్సరాలనుంచి పడుతూనో లేస్తూనో ప్రాకులాడుతూ వస్తూయున్న యీపద్ధతుల లోని గొప్పతనాన్ని, మానసికశక్తి తగ్గిన యీరోజులలో మనము గుర్తించలేకపోవచ్చు. అంతిమంలో విశ్వాసంకదా

మనకు ముక్తినిచ్చేది అయితే ఆవిశ్వాసం సహేతుక చర్చా పరిణామమయితే శ్రేష్ఠమంటావు నీవు. అవును నేను ఒప్పుకుంటా. శాస్త్రానుభవం సహృదయం కలిగిన లోకానుభవానికి లొంగినడువాలని హెచ్చరిస్తూ, యిప్పుడు సత్యమే యెందుకు ప్రబోధం చేయబడింది? సత్యాన్ని యెందుకు పాటించాల? హరిశ్చంద్రుని ఆదర్శంగా యెందుకు గ్రహించాల? అనే ప్రశ్నలు నీకు లేవుగదా? ఇక యిలాంటిదే మరొకసిద్ధాంతం చెపుతా. దీనికోసమే యీలేఖ మొదలుపెట్టా- కాని ప్రబోధానికై యెట్టి సిద్ధాంతాల ఆచరించాలో తెలిపేందుకై సత్యాఅసత్యాలను నీయెదుట వుంచా క్షమించు- నీకు శ్రమయిస్తేకాని విజ్ఞానాభిలాషికి ఓపికా, తగుప్రయత్నం లేంది విజ్ఞానం యేలా వస్తుంది?

**హింసా స్వరూపము**

విను- హింస అంటే నీకు తెలుసుగదా! యీహింస యెన్నివిధాలుందో చూచావా? మానసికహింస, శారీరకహింస, జంతుహింస, క్రిమిహింస, యింకా యింకా యెన్నోయెన్నో వర్గాలకు సంబంధించిన హింసలున్నాయి- మానవుడు యీహింసలన్నిటికి దూరం ఉండడం ఉత్కృష్ఠత చాటుతుంది- ప్రతివాడు చేయాల్సిందిగూడా యిదే. కాని కొంచెం వూహించి చూడు- ప్రపంచంలో యేప్రాణియైన మరొకప్రాణిని హింసించం దుండగలదేమో చూడు- మానవుడు మాంసం దింటే జంతుహింస అవుతుంది- పశువును ములుకోలతో పొడిస్తే పశుహింస అవుతుంది- గాలిపీలిస్తే

క్రిములు చావడంచే క్రిమిసంతతి హింస అవుతుంది. నడుస్తూ యుంటే అదృశ్యమగు సూక్ష్మప్రాణులహింస అవుతుంది-మరే మంటావు? నీవుతినకుండా, గాలి పీల్చకుండా, నడువకుండా, గాలిలో ఎగిరి క్రిందపడకుండా యుండగలవా? ఉండగలిగినా నీకఠినదేహాన్ని సూక్ష్మప్రాణులు తాకి ఎంతబాధపడుతారో గదా! మరి బ్రతుకడంఎలా హింసకు దూరంగాఉంది? అనేదే నీప్రశ్నకావచ్చు. కాని హింసచేయకుండా బ్రతుకడంఎలా? గనేది నాప్రశ్న. కొంచెం ఆలోచించు. బహుశా ప్రకృతిలో ఒకప్రాణి మరొకప్రాణిపై ఆధారపడివుందని నిర్ణయానికి వస్తావు. అంటే హింస తప్పదన్నమాట. మరి అయితే యీ అహింస అనేపదం ఎక్కడనుండివచ్చింది? బుద్ధుడు. పాణినీయుడు, మహావీరుడు, క్రీస్తు చేసిన అహింసా ప్రచారమేమిటి? గాంధీగారు ప్రస్తుతము చేస్తూయున్న అహింసాప్రచార అర్థమేమిటి? అహింస అంటే హింసకానిది యనియేనా? అయితే హింసలేంది ప్రపంచం లేదుగదా? హింసలేనిది మానవుడు బ్రతుకలేడే? అహింసను పాటించాలంటే వ్యక్తిచావాలె! మరి అహింస అంటే మరణమా! మరణమే అయితే నీవు నేను ఈఅహింసా సిద్ధాంతానికి దూరంగా యుండడం మంచిదికదా! మనకు చావాలని లేదుగదా! సరేకాని గాంధీజీ యింకా అహింసాసూత్రాన్ని ప్రబోధంచేస్తూ ఏలబ్రతికియున్నాడు? తరుచు కథలలో వింటూన్న ఉల్లిపాయలు తినవద్దని ప్రబోధంచేసిన గురువులాంటి మనిషేనా గాంధీజీ? ఇతనిపూర్వులు, బుద్ధుని

గూర్చి మరేమంటావు? శంకర్! కొంచెం ఆలోచించు ఈశబ్ద కోశాలు, యీ నిఘంటువులు, యీ అహింసా ప్రబోధానికి గడంగిన నాయకులు చెప్పే అహింస అర్థం చావమనా? లేక బూటకమా?

నీకు కామ్రేడ్ రావుకు మాదిరి నిరుత్సాహం కలుగ వచ్చునే సమాధానం చెపుతే!

అహింస అర్థము

అహింస అంటే చావడంకాదు. Largest Love విశ్వప్రేమ మానవశక్తికి తగ్గని ప్రేమని చూపించడం. ఆచరణలో పెట్టడమన్నమాట.

గుర్తుంచుకో? హెచ్చరిక

ఈనిర్వచనం గుర్తుంచుకో? అశోకుని యినుపస్తంభంలాగానో, పెద్దన మనుచరిత్రలాగానో, నిరంతరం కాన్పించు సూర్యునిలాగానో, నీహృదయంలో బాగానాటుకపోని. నీవిజ్ఞానం దీన్ని మరవనీయావాక. నీవాతావరణం యీ నిర్వచనాన్ని కప్పిపుచ్చనీయవాక. జాగ్రత్త. లేకపోతే మహాత్ములు, యీసిద్ధాంత ప్రబోధకులు నీయెదుట వెధవలైపోతారు. నీవు సూక్ష్మాన్ని గుర్తించక మూఢుడవవుతావు.

అహింసా స్వరూపం

పిచ్చివాడా! నీవు మీతల్లిని హింసించి పుట్టావు మీతల్లి నిన్ను ప్రేమతో పెంచింది. నీవు కన్నతల్లి ప్రేమను మరువలేదు. ఆవిడ నిన్ను కని పెంచిన

ప్రేమను మరువలేదు. ఆవిడ నీఅభివృద్ధికై తిట్టింది. కొట్టింది. నీవు కొట్టబడ్డావు తిట్టబడ్డావు. తిట్టావు. కొట్టావు. కాని తుదకు ఆవిడ మనస్సును హింసించి నీవన్నా అస్తమిస్తావు లేదా నీమనసును హింసించి ఆవిడన్నా అస్తమిస్తుంది హింసతో పుట్టి హింసిస్తూ నశించేనీకు, నీతల్లికి బ్రతికియున్న కాలంమధ్య మాతృప్రేమచే ప్రేరేపించబడి జరిగిన హింసా ఘట్టాలన్నీ అనుభవంలో అహింసయొక్క కనీసపు సరిహద్దులు సూచిస్తాయి. మీతల్లి గాఢప్రేమతో నిన్ను పెడమార్గాన్నుంచి త్రిప్పేందుకై చేసినహింస సాధారణప్రజాళికి అందుబాటులో యుండికదా? ఇక నీతప్పులకై నీతల్లి తననే హింసించుకుంటూ మార్పులు తేగలందులకై యత్నిస్తే యీయత్నం అహింస యొక్క నిజస్వరూపం. అన్నం తినకుండా కొడుకుల దుర్బుద్ధిని మార్చిన తల్లులు ఎంతమందిలేరు? అదే కళంకితరహితమగు అహింస. అంతేకాదు, నీవు ఏడుస్తున్నా కాళ్ళువిరిచి నీఅభివృద్ధికై మందులుపోయించిన రోజులలోను, నీవు పాలు త్రాగుతూ మాతృస్తనాల నొప్పిస్తే, బాధను ఓర్చుకొని నిన్ను పోషించిన రోజులలోనుజరిగిన తప్పనిసరి హింస అంతా అహింసయే అవుతుంది కాని యీతప్పనిసరి హింస భగవత్ సృష్టిలోనిదేయై యుండాలి. మానవనిర్ణీతమైంది కాకూడదు. భగవత్సృష్టి అనేదానికి నీకేమైనా అభ్యంతరముంటే సహజమై వుండాలి

అహింసా నిజస్వరూపం తెలిసినపిదప సాధారణమానవుల దృక్పథంలో సంచుకొనే, యీమిగతా అహింసాఘట్టాలు

నిర్వచనం చేస్తూపోదాము పైన నీకు నీతల్లికి సంబంధించిన ఘట్టాలలో జరిగిన అవసర కనీసపు హింసఅంతా మాతృ ప్రేమలో అహింసగా మారింది.

**తెలియకచేసే హింస అహింస**

ఇలాగే మనకు తెలియకుండా మనంచేసే హింస అంతా అహింస అనవచ్చును. తెలియకుండా అంటే అజ్ఞానంలో చేసేదికాదు. కంటికి, స్పర్శకు, దూరంగాయుండి చేసేదిఅంతా అన్నమాట

అయితే తెలిసిచేసే హింస హింసఅని ధ్వనివస్తుంది కదా! కాబట్టి కూరలుకోయడం హింస అంటావు. అవును, నీ దృక్పథంతో. కాని అహింసనిర్వచనం జ్ఞాపకంతెచ్చుకో! మానవశక్తికి తగ్గని ప్రేమను చూపించడంకదా అహింస అంటే.

**కూరలుకోయడం అహింస**

నీవు బ్రతికేందుకై, మానవ అవసరాల పూర్తి చేసుకునేందుకై, మానవశక్తికి తగ్గని ప్రేమను చూపిస్తూచేసే యీ కూరలు కోయడంలోని హింస అహింస అవుతుంది. కాయలు కోస్తూయుంటే నీకేమైం కోపంగాని, ద్వేషభావంగాని కలుగుతూయుందా? కాయగూరలపై ద్వేషంతోగాని, కోపంతోగాని వాటిని కోస్తున్నావా? లేదంటావునీవు. కాని గొర్రెనుకోసే కసాయివాడు గూడా నీమాదిరి హృదయంతోనే కోస్తున్నాడుగదా! అవును. మరి అయితే మొదటిది అహింస ఎలాఐంది. రెండవది హింస

ఎలాఐందని నీవడుగవచ్చు. సమాధానంచూడు. అసలు మానవుడు శాఖాహారా? మాంసాహారా? విజ్ఞానవేత్తలు మానవుడు శాఖాహారియని చెప్పుతున్నారు అందుకోసం మానవ లక్ష్యాన్నితప్పి యీ అనవసరపు జంతుహింస హింసయేగాని అహింసకాదు. మరి కూరగాయలు బియ్యంపోటి ముడిపదార్థాలు దొరకని ప్రదేశాలున్నాయికదా! మరి అచటి మనిషి అహింసాసూత్రం పాటించాలంటే ఏంచేయాలి? తప్పకుండా అచట దొరికే యితరప్రాణుల హింసించాలి. అది తన ప్రాణాని కవసరమై ఆరోగ్యకరమైనటువంటి ప్రాణులను మాత్రమే. ఈలాంటి కనీసపు అవసరహింస అంతా అహింసయే. అయితే ఒక పెద్దనాయకుని వాక్యాలు కొన్ని యిచట పొందుపరుస్తా చూడు! ఎంత అర్థంలేకుండా మాట్లాడుతాడో అతను. అతన్ని కొందరు మహాత్ముదూ అంటారు. మరికొందరు బూటక మహాశయుడంటారు అవ్యక్తి యెవడో నీ వూహించవచ్చు. మనిషి శాఖాహారి వంకాయి తినదలచాడు తప్పలేదు. ఆవంకాయను చెట్టుమీదినుంచి కోయడం హింసేకాని తినేందుకోసం పరిపక్వదశలో కోశాడుగాబట్టి అహింస అయింది. అయితే యీ వంకాయను పొడవు 1/4 వెడల్పుగల ముక్కలు చేస్తే మనిషి తినగలడు ఇటువంటి ముక్కలు పన్నెండొక్క వంకాయతో అయినవని అనుకో. అంటే అవ్యక్తి పన్నెండు యూనిట్లు (Units) హింసచేశాడన్నమాట. యీమాత్రం హింస మానవపోషణకై అవసరంగాబట్టి, అహింస అయింది.

మరొకమనిషి పదమూడు ముక్కలు యిదేవంకాయను కోశాడనుకో, అంటే పదమూడు యూనిట్లు (Units) హింసను చేశాడన్నమాట. దీనిఫలితంగా అతను ఒకయూనిట్ హింస అధికంగా చేశాడన్నమాట అంటే అదేవంకాయతో హింసాదృష్టితో ప్రవర్తించాడన్నమాట. నీవు నవ్వుతావు యీపైవాదన వింటూ. ఎందుకంటే చెట్టుపైనుంచే కోస్తే ప్రాణంపోయిన వంకాయను, ముక్కలు చేస్తూంటే హింసించబడుతుందనే నమ్మకమెలాగని? మరి హింసలేనపుడు పదమూడుముక్కలైతేనేమి? యిర్వయి ముక్కలైతేనేమి? కోటి ముక్కలైతేనేమీ? అయితే యీ యూనిట్లు లెక్కేమిటి?

**భావము భాష**

శంకర్! కొంచెమాలోచించు. ఇలాగెందుకంటావో నీవర్థంచేసుకోకపోవడం చాలా విచారకరం ఆధునిక యువకులలో చాలామంది శబ్దాల అర్థాన్ని పట్టుకొని (          ) నిర్వచనం అనేపేరుతో అక్షరాలనే చీల్చి అసలు రచయిత లేక ఉపన్యాసకుని యథార్థభావాన్నిదూరం చేస్తూన్నారు. అంటే శబ్దం భావాన్ని ప్రదర్శించిందా అనవచ్చు. ప్రదర్శిస్తుంది. కాని ఒకేశబ్దం అనేక భావాలకుకూడా తావుయిస్తూందని నీవుమరువకూడదు. అలాంటప్పుడు రచయిత లేక ఉపన్యాసకుని భావం గ్రహించలేకపోతే ఆ రచయిత ఆ ఉపన్యాసకుడు శబ్దాలప్రోగుచేసి ప్రకటించడంమాత్రమెందుకో ఆలోచించు. కాబట్టి శబ్దార్థమేదైనా రచయిత, ఉప

న్యాసకుని భావం గుర్తింపజేసేదిగా మనం నిర్వచనం చేయుడం సమంజసముగదా!

ఈ ఆలోచనసిదప ప్రకారము 13 యూనిట్ల హింస జరిగిందంటే! యూనిట్ హింస చేసే నీశక్తి వృధాపోయినట్లే గదా! ఈలా నశించే శక్తి పెరిగితే ప్రపంచములో ఎంత మానవశక్తి వృధాపోతుందో చూడు అంటే నీ జీవనలక్ష్యం పోయిందన్నమాట. యేమంటావు యీ సూక్ష్మబుద్ధిగల వాక్యాన్ని. జీవలక్ష్యాన్ని తప్పడం హింస అవుతుంది కాబట్టి

జీవనలక్ష్యం తప్పడం హింస

యీ లక్ష్యాన్ని దృక్పథంలో నుంచుకొని నీవు సజీవుడుగా యుండేందుకై ద్వేషము లేకుండా నీశక్తికి తగ్గని శాఖములపై ప్రేమనుచూపిస్తూ చేసేహింస యీ ఘట్టంలో అహింస అవుతుంది. అవును నీవు ఆహారం వరకు హింసా అహింసాతత్వాన్ని అర్థం చేసుకోగలిగినావు. కాని యెద్దును బండికికట్టి ములుగర్రతో యర్రపుండు పడేటట్టు పొడిచే బండివానిదికూడా అవసర హింసేకదా! అంటే అహింసకాదే అని అడుగుతావు. అవును ప్రశ్నించే అధికారం నీకుంది. పూర్తిగావిషయంవిని అర్థంచేసుకొని వాదించు. యిదే సక్రమవాదనా పద్ధతిగదా! అవునంటావు. అసలు యెద్దు నీమాదిరే పుట్టింది నీకు వాతావరణంతో యెంతస్వేచ్ఛ కవకాశముందో దానికి అంత అవకాశముంది. అయితే దానిస్వేచ్ఛ నీకుమాదిరి ఇతరప్రాణుల దాస్యంలో ఉంచేదికాకుండా దాని జీవనానికై భోజ్యపదార్థాలు పొందేందుకు, అవసరమైనహింస

మాత్రమే చేసేందుకు, విజ్ఞానం తద్వారా అధికారం కలిగి యున్నాయి. వాటిశక్తిగూడా అంతేకాని మానవుడు విజ్ఞాని. యీ విజ్ఞానంతో అభివృద్ధికై ప్రణాళికలు వేస్తూ తననూతన దేశాన్ని పైకితీసుకువస్తాడు. లేదా తననూతన దేశాన్ని నేల మట్టం చేస్తాడూ! అయితే నాశనంచేసే విజ్ఞానాన్ని విజ్ఞాన మంటావా? అని నీవడుగవచ్చు. కాని నీకున్న సందేహమే నాకుంది. పాశ్చాత్యవ్యామోహంలో ప్రస్తుతవిజ్ఞానం మారణ యంత్రాల సంఖ్యను పెంపొందించే వారంతావున్నా, అవి యుద్ధాలలో అగ్రస్థానం వహించి ప్రపంచనాశనానికి కారణ భూతమైనా! యింకా, అభివృద్ధిదేశా లంటున్నారు.

**విజ్ఞానం అంటే**

విజ్ఞానం అంటున్నారుకాబట్టి అసలుయధార్థంలో వినాశనానికి దారితీసేది, విజ్ఞానం కాదంటే ఒకప్పుడు నీవు కామ్రేడ్ రావు నా ప్రాణం తీసినా తీస్తారు. దీనికి కారణం భౌతికవాదంపైన దెబ్బకాదా యిది ఆ వాదపరిణామము వినాశనమేకదా! సరే యేమైనా యితర జంతువుల వుపయోగించుకునే అధికారం మానవుడికి లేదు. కాని పరస్పర సహాయం అంగీకరిస్తే ఇతర జంతువులను మన విజ్ఞానంతో స్వాధీనం చేసుకోవచ్చు. పురుషుడు స్త్రీనివివాహ మాడాడంటే అర్థమేమిటి? స్త్రీని తాను పోషించి బాధ్యత గైకొన్నాడని, తత్ఫలితంగా ఇంటిపని స్త్రీ చేయాలని, బైటి పనులు పురుషుడు చేస్తాడనీ హామీకదా!

**వైవాహిక ప్రేమతత్వం లోనిఅహింస**

ఇది ప్రాచీన భారతీయ నాగరకత. పనిపంపిణిని బట్టి పాశ్చాత్యులకిది దూరమేమో. ఏమైనా యీపాఠవిూ ప్రేమసూత్రంపై నాధారపడింది. కనుక దీని యాచరణలో యెంత హింసాయుక్తమైన ఘట్టాలు వచ్చినా అది ధర్మమనిపించుకొంటుంది యీ ధర్మనిర్వహణలో భార్యాభర్తల అన్యోన్యప్రేమ దెబ్బతినకుండా జరిగిన హింస అంతా మానవప్రేమతో అహింసగా మారుతుంది

**పశువును పెంచడం అహింస**

అలాగే ఎద్దును నీవు పోషించుతావు. ఎద్దు నిన్ను పోషిస్తుంది. ఇది యొక ప్రేమసూత్రంపై నాధారపడిన యొడంబడిక. ఈయొడంబడికను జంతువుపై ప్రేమతో ఆచరణలో బెట్టిన అగు హింసఅంతా అహింస అవుతుంది అంటే ఎద్దుపుండు పడేదాకా పొడవవచ్చు అన్న మాట. ప్రేమయుంటే అలా చేస్తాడా?

**చేర్లుకొట్టడం అహింస**

ఇది అర్థమైనపిదప పశువులపై ప్రేమతో కోడెల చేర్లుకొట్టి వాటి వంశాన్ని అంటే పశుసంతతిని అభివృద్ధికి తేవడం హింసకాదు అహింసయే అవుతుంది. అయితే ఈపద్ధతి మానవులదాకా వర్తింపజేయవచ్చు గదా? అని నీవడుగవచ్చు అందలి సాధక బాధకాలు నీకు తెలుసు కాని కామ్రేడు రావు వెనుకంజవేయడు అతనికైనా సమాధానం చెప్పాలికదా! చూడు. ఈపద్ధతిని ఆచరించే విషయంలో మానవవిజ్ఞాన మేకీభవిస్తే ప్రస్తుత మానవసంఘ

పద్ధతులలో నీకు నష్టం కాన్పిస్తే కార్మేదు, నీవు, మరికొందరు అంగీకరిస్తే ఫూనుకో. కాని మానవత్వ సిద్ధాంతానికి విరుద్ధ కార్యక్రమం తలపెట్టవాక. క్లుప్తంగా మార్పు లోకాను భవంలో లోపం దిద్దుకోలేనపుడే చేయాలికదా! ఆలోచించు. నీవు ఆ కాంచేస్థితిని తెప్పించే మానవజాతి విజ్ఞానంతో వున్న దంటావా? మానవులు బ్రహ్మచర్యాన్ని కొన్ని యుగాల దాకా బయటికిరాకుండా పూడ్ప యత్నించుచున్న యీ రోజుల్లో యీసమస్య నన్ను చాలా కలవరపెడుతూంది. అయినా మార్పు ఎపుడుచేయాలో నీకు యిదివరలో చెప్పా గదా. యీవిధంగా జంతుసంతతిని పెంచడంలో హింసాహింసలు చర్చించాం. మరి మొన్నటివార్త! కామేడు రావు అహింసతో మతరక్షణ యెలాచేస్తారో చెప్పగలుగుతారా? అని అడిగాడు. నీవేంచెప్పుతావనన్నాడు? నవ్వాడు వెళ్ళిపోయాడు. ఇదంతా నేచెప్పకముందే ఇదే యీ కామేడువైఖరైతే భగవంతుడు యెదుటివాడికి నోరు నాలుక యెందుకిచ్చాడో తెలియదు. భగవంతుడంటే నీవు నమ్మవు కోపం కూడాను. కాని ప్రకృతినిగాని, మన కతీతమైన శక్తినిగానిఅంటే కొంచెం నమ్ముతావు.

అంటే నీకు పూర్తిగా అభ్యంతరములేదుగదా! ఆఁ.

అదేప్రకృతి, అదే మానవాతీతమైన శక్తి, మన మత మతప్రవక్తల సృజించింది. వీరందరి ధ్యేయము యొకటే. అదే

ప్రపంచశాంతి, మానవ కల్యాణము. మతాలు మానవులఐక్యత కొరకే చేయబడ్డవికాని ఐక్యతావిచ్ఛిన్నంకోసం కాదుగదా! యీ యథార్థాన్ని స్వర్గీయులై నేటికి చిరస్మరణీయులైన ప్రతి మతప్రవక్త ప్రబోధాలలోని ముఖ్యసూత్రమని వేరుగా చెప్పనక్కరలేదు అంతే గాదు. సజీవులైనవారుకూడా. అయితే యీ కలహాలు యెందుకొస్తున్నాయి? మతధర్మమును విడిస్తేనే కదా ముఖ్యంగా ఈధర్మమును మరపించేది ఆర్థికసమస్యయే క్లుప్తంగా చెప్పదలచుకొంటే మతకలహాలు మతకలహాలుకావు. అవి ఆర్థికకలహాలు. ఎసెంబ్లిలలో సీట్లు, ఉద్యోగాలలో ప్రాతినిధ్యాలు. ఇవి మతాలలో ఏప్రవక్తయైన చెప్పాడా? ఇవే కదా కలహాలు తెస్తున్నవి. ఏమంటావు శంకర్! గాంధీజీ క్రైస్తవ మతబోధకులకు చెప్పిన వాక్యాలు యీక్రింద పొందుపరుస్తున్నా

They should not conscously or unconscously lay violent hands up on the manners and custom of the country- In so far as they are not repugnant to fundamental to morality. It is not part of your call. [said he]. I assure you to tear up the lives of the people of the East by these acts. Humility is one virtue he would ex all over an pride and patriotism.

అనువాదం— తెలిసికాని, తెలియకగాని, ప్రధానమగు నీతికి విరుద్ధముకానంతవరకు యీదేశముయొక్క ఆచార

వ్యవహార పద్ధతులపై దౌర్జన్యముగు చేతలు చేయరాదు. (వారు అనగా మిషనరీలు) పాశ్చ్యాదేశస్థుల జీవితముల చీల్చి వేసి కూకటివేళ్ళతో పెకలించుట యీపిలుపయొక్క ఉద్దేశ్యమై యుండరాదు. అహంకారము దేశభక్తికన్న మించినది నమ్రభావమే.

పైవాక్యాలు చదివితే మతాలు ఏవిధంగా దుర్వినియోగం చేయబడుతున్నాయో, ఎందుకు గాంధీజీ హెచ్చరించాల్సివచ్చిందో నీకు తెలుస్తుంది. అంటే మతాలనీతి ఉద్దేశం పోతూయుందిగాబట్టే కలహాలు. కాన మొదలు మతాల సరిగా అర్థంచేసుకోవాలి.

అర్థంచేసుకునేలోగా మానవబలహీనతలు, మతాల పేరుతో మూఢత్వంలో మతకలహాలు తెస్తే ప్రచారం, ప్రబోధం ఓడిపోతే, నీఅహింస మూఢుల దౌర్జన్యాన్ని యెదురుకోవాల్సివస్తే, తల్లి పిల్లవాణ్ణికొట్టినలాగా, పంతులువిద్యార్థినికొట్టినలాగా, సోదరప్రేమను, మరువకుండా ఆత్మరక్షణార్థం కనీసపు అవసరమైనా హింసతో దుండగీడులను నిస్సహాయుల చేయుము. ఇదికూడా అహింసయే అవుతుంది. ఈమధ్య ఢక్కాలో జరిగిన హిందూముస్లిం కొట్లాటలో యొక ముదుసలి పండ్లుయూడిన ముదుసలికి యాదేసలహా నిచ్చాడు, కొందరతని మాటలు కలగూరగంపలాగా లేక కిచిడీలాగానో యుంటుందంటారు. కామ్రేడులైతే అతనిని పాల్సీమనిషిగా లెఖిస్తారు.

యేమైనా జాతీయవాదానికతను కొలతబద్ధ. ఇక రాజకీయరంగంలో అంటే జాతి స్వాతంత్ర్య రక్షణావిషయంలో అహింస యెలావర్తిస్తుంది. అని నీవు మొన్న అడిగావు. తొందరలోనే చెప్పలేకపోయా. కాని హింసాసూత్రంతో స్వాతంత్ర్యాన్ని నిలుపుకోవాలని యేడుశక్తులలో ఒకటైనా మాజినో శక్తికలిగిన ఫ్రాన్సు యేడురోజులలో, నేషనల్ సోషలిష్టు హిట్లరు చేతుల్లో పడిపోయింది. అంటే యెంతవిచారకరం. యీనేషనల్ సోషలిష్టు, ఫాసిష్టు, సాగ్రిత. మరి హింసామార్గంద్వారా తప్పక జయం వస్తుందని నమ్మకముగా లేదాయె 1914 యుద్ధం ప్రస్తుతయుద్ధానికి దారితీస్తే ప్రస్తుతయుద్ధము మరొక యుద్ధానికి దారితీయాలికదా! మరి యిదే హింసాపరిణామమైతే, యుద్ధంలో నాయకులు యింతమందని యోచించాలి. వ్యక్తిప్రేమను వదిలి జాతిప్రేమకై యీ రక్తప్రవాహం యెందుకు చేయాలి. ప్రేమంలో వ్యక్తిప్రేమకు తావులేదా? మన చరిత్రలో హింసాసిద్ధాంతంద్వారా రాజ్యాలు జయించినట్లు కాన్పిస్తుందేకాని రాజ్యాలు సదానిల్చుకున్నట్లు కాన్పిస్తుందా? అయితే రాజ్యాలు కష్టపడి గెల్వడం పోగొట్టుకునేందుకోసమేనా? యనేప్రశ్నలు నన్ను చాలా కలవరపెడుతున్నాయి. అందుకోసం, యిన్నాళ్ళనుంచి శాంతిస్థాపనకోసము, విఫలులైన యీ సాధనాన్ని వదలి మరేదైనా నూతనమార్గాన పోవాలని నాకోర్కె.

పాతచరిత్రలో లేని సాధనామార్గం పనికిరాదా

ఆయితే యీ నూతనమార్గము యిదివరలో చరిత్రలో యుండాలని కామేశ్వరరావు అంటాడు. కాని చరిత్రలోలేనిది యేదైనా ప్రపంచశాంతికోసం నూతనపంథా త్రొక్కడం తప్పా? తుదకు యేతత్వమైనా ఆచరణలో పెట్టాలంటే వ్యక్తిగత ప్రబోధం సమిష్టిలో ప్రచారం, శాంతియుతాధికారం, ఉపయోగించాల్సిందేకదా? మరి యీనాడు ఆయుధాల్ని ఉపయోగించి అహింసాసూత్రాన్ని ఆచరణలోపెడ్తే! చరిత్రలోలేదని భయపడవాకా! సిద్ధాంతం ఇదివరలో బుద్ధుడు, క్రీస్తు, ఆచరణలో పెట్టిందే. తుదకు 1922వ సంవత్సరంలో ముసల్మాను ఉలేమా కూడా శర్యత్ అహింసను వాక్కాయ కర్మోద్దేశ్యముల (Infention, Word & action)లో ప్రచారం చేసింది. అని, భావనలోమాత్రం లేదని ఽభిప్రాయం ప్రకటించారు. కాబట్టి చరిత్రలో నూతనమంటూ యున్నా సాధన ఇదివరలోనే ఇమిడీయుండి కాబట్టి మనం వాడవచ్చుగదా! కామేశ్వరరావన్నట్లు ప్రతినూతనవిషయం చరిత్రలోనుంటే అది నూతనమెలా అవుతుంది? ఆలోచించు

అహింసప్రకారం జపాను జర్మనీలు వస్తే యేంచేయాలి?

ఇలాంటి పరస్పరవిరుద్ధభావాలన్ని, కామేశ్వరరావుని వదిలితే అహింస శత్రువును హాతమార్చే యొకవజ్రాయుధం యేలా అంటావా? హింసకు మందు అహింసే? యేలాగో చూడు. కొద్దిపాటి హింసను ఆపేందుకై మరింత హింసచేయాలిగదా యిలాటి

తక్కువహింసను. ఆపేటందుకు యెక్కువహింసనూ చేస్తూ పోతుంటే దీని అంతమెక్కడ? కాబట్టే హింసకు మందు అహింస. యీ అహింసాసూత్రంప్రకారం శత్రువస్తే వాడికి తాగటానికి నీరు, తినటానికి తిండి, నీయకూడదు. సహాయనిరాకరణయుద్ధం చేయాలి. ఈయుద్ధంలో కోట్లకొలది రూపాయలు వెచ్చించి ప్రోగుచేసిన మారణయంత్రాలు సమిష్టిగా చంపలేక వ్యతిరేకుల నొక్కొక్కరిని చంపాల్సి యుంటుంది. లేదా వ్యతిరేకుల నందరినీ ప్రోగుచేసి చంపాల్సి యుంటుంది. రెండు కష్టమే. యెందుకంటే అహింసాప్రపంచంలో ఆక్రమిత దేశాలలో యేపద్ధతి నవలంభించిన ఒక్కరు కూడా మిగలరు. అయితే రాజ్యాలు స్మశానాలు నేలేందుకా? అదికాదని నీకు తెలుసు. కాని సందేహాలు తప్పవు కదా! ఒకవేళ ఆక్రమిత దేశంలో విజేయులు తమసంతతిని ప్రవేశపెట్టి పరిపాలింపవచ్చునంటావు? కాని ఒక దేశపు ప్రజల పూర్తిగా నాశనంచేసినపిదప, ఆదేశంలో తమ జనాభాను నింపాలంటే, తమదేశంలో జనాభా తగ్గడంలేదా? అయితే క్రమేణ విజేయులు వారిసంతతిని ప్రవేశపెట్టి అభివృద్ధి చేస్తారంటావు. అవును. కాని యీపద్ధతితో నిర్జనభారత దేశం యెన్నిసంవత్సరాలకి విజేయులకు ఫలప్రదంగా మారుతుంది? కొన్నితరాలు బట్టుతవికదా! అదిగాక యీవిధంగా తయారైన సంతతి, జపానువారికి, జర్మనీవారికి, మార్కెటుగా వుంటుందా? మరి అయితే బ్రిటనుజాతి అమెరికాలో పెరిగి,

అమెరికగా బ్రిటనుకు భారతదేశంలాగా మార్కెట్టుగా వుండే టట్టు ఉపకరిస్తూ యుందా? ఇవన్ని విన్నవిరాదటం బానిస దేశాలు విజేతల మార్కెట్టులకోసమని గుర్తించినపిదప, నిస్సహాయుల కొట్టినపుడు ద్వేషాలు కలుగవని తెలిసికొనిన పిదప, ప్రతిమానవుడిహృదయం ఒకప్పుడు కాకపోతే మరొక ప్పుడు మానవ ప్రేమను మోగించుతుంది. ప్రకృతియని గుర్తించినపిదప అహింసాసూత్రం పాటించడం తప్పా? దానిలో బలములేదా? బలములేదనవాక్. కాని హింసాపద్ధతులింతదనుక శాంతిని నిలుపలేకపోయినవి. కాన నొకయవకాశము అహింసకు ఇవ్వాలి! ఇచ్చుట మంచిది.

**అహింసా ఏల పాటించాలి**

దీనికి మరొక కారణంకూడా వుంది. ఒకతత్త్వాన్ని ప్రబోధం చేసేముందు ఆతత్త్వమునందరు పాటిస్తే సమాజికవ్యవస్థ నిలుస్తుందా? దాన్ని పాటిస్తే మానసికశక్తి వస్తుందా? అనేవేకదా ముఖ్యప్రశ్నలు ఆలోచించాల్సింది. కొంచెంచూడు అహింస మానవబలహీనతల నెదుర్కొంటుంది. దీన్నిబట్టేగదా అసత్యాన్నివదలి సత్యాన్ని ప్రచారం చేయమని, నిర్ణయానికి వచ్చింది. ఎందుకంటే రాగద్వేషాలన్నది చంపుతుంది. కాబట్టి మానసికశక్తి నిస్తుంది. అంతే కాదు అందరు పాటిస్తే శాంతితప్ప వేరేలేదు దీనితో నీవు ఏకీభవించావుగదా! ఈ అహింసాసూత్రం సత్యంలాంటిది. ఇక హింస చెప్పకముందు, ప్రయత్నము చేయకముందు

వచ్చేది. అశాంతిని తెచ్చేది. అంతేకాదు అందరు పాటిస్తే మానవులలో ఒకరుగూడా మిగులరు. కాబట్టి హింస పనికి రాదు. అహింస పాటించాలి. ఈమాట అనగానే కామ్రేడు రావు నాబోటివారికోసం కాదు యీసిద్ధాంతం మరి పెద్దల కోసమంటాడు. అలాగే ఒకధనికుడు కమ్యూనిజసిద్ధాంతం నాకోసంకాదు, అల్పులకోసమంటే మండిపడుతాడు. ఎందుకొఱకు? కమ్యూనిజసిద్ధాంతం మంచిదికాబట్టే ఆచరణలో పెట్టాలంటాడు? అయితే మంచిసిద్ధాంతం ఎంతకష్టతరమైనా పాటించాలంటాడు. ఈయుదారత నహింసవైపు కెందుకుతిరగదూ? అహింస ప్రపంచంలో ఆచరణకురావడం కష్టం, దుర్లభం, అని విశ్వాసం ప్రకటిస్తాడు. కాని కామింటర్న్ ద్వారా యావత్ప్రపంచంలోని కార్మికులలో కార్మికరాజ్యం స్థాపింపచేసే యూహ.

**హృదయ పరివర్తన రాదా?**

అట్టి హృదయపరివర్తన వస్తుంది అంటాడు. ప్రపంచం దీనికి తలయొగ్గుతుందంటాడు కాని అహింసా విషయంలో ఇదే ప్రపంచంలోని మానవజీవులలో నూటికి తొంభైపైనయున్న కార్మికేతరులలో అందరికి సమాన దృష్టితో వర్తించేరాజ్యం అహింసద్వారా వస్తుందని వారి హృదయాలలో పరివర్తన వస్తుందన్నా, కార్మికులు తమ స్వార్థం, తమ వర్గంకోసం, రాజ్యాధికారం సంపాదించడం మాని, అందరుకలిసి నడుపగల్గిన రాజ్యమాశించే హృదయపరివర్తన వస్తుందని అన్నా నమ్మడు. మరిఒకచో నమ్మినహృదయ

పరివర్తన శ్రేయస్సు విధానాలలో మరొకచోట ఎందుకు రాదూ? అనేది నాప్రశ్న. నీవు ఆలోచించు. యీకామేశ్రిదు వాదన యెంత సమంజసమో? సిద్ధాంతాన్ని నమ్మి ఆచరణ శక్తిని నమ్మకపోవడం మానవశక్తినిమోసగించడం. కావుననే మానవత్వాన్ని రుజువుచెయాలంటే యీసిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టాలికాని అసత్యాన్ని వదిలి, సత్యాన్ని, స్వార్థాన్ని, వదలి, నిస్స్వార్థాన్ని పాటించాలంటే ఎంతమానసికశక్తి కావాలో అంత మానసిక శక్తికన్న కొంచెం ఎక్కువగానే హింసను వదలి అహింసను పాటించాలంటే కావాలి. అట్టిశక్తి మనలో యుందా? అనేది మొదటిప్రశ్న. ఇటువంటిశక్తి సాధించాల్సి యుందని, ప్రస్తుతం మానవులలో లేదని నీకు తెలుసు. కాబట్టి యీశక్తికై యత్నిస్తు ఇట్టిశక్తి వచ్చేదాక బలహీనులై నిరాయుధులై ఇతరులకు లొంగడంకన్న బలహీనులై సాయుధులై ఇతరుల నెదుర్కొని గెలుపొందడమో లేక స్వర్గీకృతులవడమో చాలా యుత్తమం. ఎందుకంటే దేహంనశించినా, ఆత్మస్వాతంత్ర్యం యుంటుందికదా! ఇదేసిద్ధాంతాన్ని ఒక దరిద్రనారాయణుడు నిరాయుధుడై గొప్ప ఆత్మబలంతో ప్రపంచానికి చాటాడు ఆతని వాక్యాలివి.

అహింసనుపాటించేంత మనఃశక్తివుందా?

I would rather have "India resort to arms in order to defend her honour said he" than that She should in a cowardly manner become or remain & helpless witness to her rendislonar.

భారతదేశము పిరికితనంతో దిక్కులేక తన అగౌరవానికి సాక్ష్యంగా ఉండేబదులు తనగౌరవాన్ని నిలుపుకునేందుకై సాయుధురాలగుట యుత్తమము.

అట్లాగే 1938 అక్టోబరులో జకోస్లోవియావారికి ఇచ్చిన సూచనలోని యీక్రిందివాక్యాలు చూడు.

I would not be a vassal to any nation or body I must have alsolute independence or perish. To seek to win in a clash of arms would be pure Bravado. Not so if in defying the might of one who would deprive me of my indepence I refused to obey his will and perished un-armed in the attempt. In so doing though I lose the body, I save my soul is my honour.

నేను ఒక జాతికిగాని, వ్యక్తికిగాని, బానిసగాయుండను. నాకు సంపూర్ణ స్వాతంత్ర్యమన్నా యుండాలి. లేదా అస్తమించాలి. సాయుధపోరాటంలో విజయానికై యత్నించడం పూర్తిగా డాంభికము కావచ్చును. కాని నన్ను దాసునిగాచేయ యత్నించువానిశక్తి నెదుర్కొంటూ, అతని కోరికకు బలికాకుండా నిరాయుధుడై యీప్రయత్నంలో నశించడం. అలాగాదు. అలాచేయడంవల్ల నాశరీరముపోయినా అగౌరవం నిలుస్తుంది.

---

గాంధీగారి మాటలు. గాంధి గాంధీజమునుండి,

అహింసను సంపూర్ణతగా సాధించే శక్తి వచ్చేదాకా ఆత్మ గౌరవరక్షణార్థం ఆత్మస్వాతంత్ర్య రక్షణార్థం సాయుధులు గావడం మంచిది. తద్వారానైనా దేశవిముక్తి సంపాదించాలి. ఇట్టి అహింసాసూత్రం యథార్థస్థితిలో చేతగానితనముకాదు. సర్వోత్కృష్టమైన సిద్ధాంతం.

Non-violence is not passivity.
Non-violence is the Supreme law.

సంపూర్ణాఅహింసను ఆచరించే హక్కు కేవలం బలవంతులకే యుంది బలహీనులు దాన్ని ఆచరణలో పెట్టడమంటే చేతగానితనాన్ని రుజువుచేసుకోవడమన్నమాట. క్లుప్తంగా చెప్పదలచుకుంటే బలహీనులకు ఆత్మరక్షణార్థం ఆత్మగౌరవంనిలుపుకునేందుకు ఆయుధాలేగాని, పూర్ణఅహింస యొక ఆయుధంగా పనిచేయజాలదు. సాయుధులగుట బలహీనుల చిట్టచివరి ఆయుధం. ఈ ఆయుధాలు వాడాల్సింది. వారి ప్రత్యేక స్థితినిబట్టి జపాను జర్మనీ ఆక్రమణలు జరిగితే, అంటాడు ఆముదుసలి. అతన్ని ఫాసిస్టు అంటారు కొందరు కామ్రేడులు.

అంతేకాదు అహింసావ్రతపాలకుడు తనజాతివిముక్తికై అన్యదేశీయుల సాయంకోరడు. కోరరాదు. ఆతనిశక్తిపై ఆతనికి సంపూర్ణ విశ్వాసముండాలి. వుండాలి.

**ధనవంతుల అహింస**

జాతిస్వాతంత్ర్యాన్ని పొందగలిగి నిలుపుకొనగలిగిన అహింసాసూత్రం ధనవంతుల దౌర్జన్యాల నాపుటకై ఏంచెప్పుతుంది? అని నీవు అడగవచ్చు. ఈ ప్రశ్న అడుగబోయేముందు అసలు పాశ్చాత్యదేశంలోని ధనవంతుల దౌర్జన్యాలు యీదేశంలో యున్నాయా? యని. ఎందుకంటే ధన, అధికార, విజ్ఞాన కేంద్రీకరణ లేకుండాచేసిన మన నాగరకతలో యీనాటి కేంద్రీకరణజరిగిన పాశ్చాత్య నాగరకతలోని అన్యాయాలు జరగటం కష్టం. కొంచెమాలోచించు. ఏవర్గంలోను యీరెండు కేంద్రీకరించబడలేదు. బ్రాహ్మణులు విజ్ఞానులు, వైశ్యులు ధనవంతులు, క్షత్రియులు అధికారులు. ఇది వర్గరీత్యా ఇక వ్యక్తిగతంగా రాజు అధికారి, వ్యాపారి ధనవంతుడు, ఋషి విజ్ఞాని, మరి శూద్రులో? జాతిపోషకులు. కాబట్టే మన దేశంలో బ్రిటను లార్డ్సులో యున్నంత సామ్రాజ్యకాంక్షగాని, ధనాపేక్షగాని, లేదు. అన్యాయాలు లేవు. ఎందుకంటే విజ్ఞానిగాని, ధనికుడుగాని, అధికారిగాని, అన్యాయం చేయాలంటే తనుగాక మిగిలిన రెండువర్గాల వారిని కలుపుకోవాలి. అందుకోసం కొంత వ్యవధి పడుతుంది. వ్యవధియున్నా యేకీభావంకలగటం కొంచెం కష్టంగదా. కాని ధన విజ్ఞానాధికారాల కేంద్రీకరణ ఒకేవ్యక్తిలోయున్న బ్రిటను అమెరికాలాంటి దేశాలలో అక్రమాలకు అన్యాయాలకు ఇంతఆలస్యం పట్టదు. ఇలాఅనడంలో మన దేశంలోని ధనికులు అన్యాయాలు చేయడంలేదని నేను అనను. వారు

కొన్ని సహింపరాని అన్యాయాలు చేస్తున్నారు. ఇది నిజం దీన్ని ఎదుర్కోనేందుకోసం బలహీనులైతే ఆత్మరక్షణార్థం సోదరప్రేమతో ధనవంతుల దౌర్జన్యాన్ని ఎదుర్కోవచ్చు. ఇదే బలహీనుల అహింస. బలహీనుల కడసారిమార్గం అన్నిటి కన్నా మంచిమార్గం సహాయనిరాకరణము అంటే సమ్మెలు. **Strike** అని భ్రమపడేవు సమ్మెలలో ఎదుటివారిపై చేయ గలిగితే హింసచేయువచ్చు.

**సహాయ నిరాకరణం**

దీనివల్ల శత్రుత్వంలో ప్రాణానికి, ఆస్తికి భయ పడి రాజీకిరావచ్చు యజమానులు. కాని సహాయ నిరాకరణంలో నాయకులు, కూలీలు, కూడ యజమానిలో జాలికల్పించో, లేక అతనిని ప్రేమతో నిస్సహాయు నిగా చేసో, మార్పుతెస్తారు. ఇది బలవంతుల అహింస. ఈ విధానంద్వారానే ధనికులు మారవచ్చు. వారికికూడా హృద యాలున్నాయికదా! స్వాతంత్ర్యంకోసం జైళ్ళలో మ్రగ్గుతూ వున్న నెహ్రూబోటివ్యక్తులు ధనికవర్గంవారుగాదా? కాంగ్రెస్ పితామహుడు నౌరోజి ధనికుడుగాడా? మరి వీరిని చూచినపిదప ధనికులు మారరంటావా? మారరా?

ఈ ధనికుల్లోనే చాలామంది తుచ్ఛ ఐహిక సౌఖ్యం కోసం స్త్రీలను చెరుస్తూయుంటారు. పాపం వారు మాన సంరక్షణకోసం పడేయిక్కట్లు చెప్పతరంకాదు. వారిలో కొంతమంది విజ్ఞానవంతులున్నారు. వారికీయహింస యెలా

వాడాలో బోధపడలేదు. కాబట్టి యీ విషయాన్ని కూడా నీకు తేటతెల్లము చేయదలచా.

**మానసంరక్షణ అహింస**

ఒకస్త్రీని ఒక దుర్మార్గుడు చెరచవస్తే బోధన ద్వారా ఆశలేదు. బతిమిలాడితే యేమిటి లాగా డని కాళ్ళుపట్టుకుంటే స్పర్శనచేశాడు. అతని మానవత్వం నశించింది. పశుత్వప్రేరేపణ అధికమైంది. మరేం చేయాలి? రామా! అంది. శివా! అంది. ఏదేవుడు ప్రత్యక్షంగా కాన్పించడు. దేవుడుమాత్రం కష్టాలలోనే స్మరిస్తే వస్తాడా? మరి ఇలాంటి స్త్రీలేకదా అధికంగాయుండిప్పుడు. అవును వీరిని ప్రజాళి చెరుచుతుంది. నైతికంగా కట్టుదిట్టాలలోయుంది. మానసికశక్తికల్గిన సావిత్రిని దమయంతిని ఎవరు చెరచలేదు. కారణం? వారి మానసికశక్తిప్రభావమేకదా! ఆశక్తియుంటే ఎవరు చెరచరు. కాని పదిమంది పురుషులుగలిసి ఒకస్త్రీని చెరచవస్తే వారిని నిస్సహాయుల చేసైనా, తుదకు చంపైనా మానసంరక్షణంచేసుకోవటం మంచిది. ఎందుకంటే ఋషులు పుట్టిన యీదేశంలో మానభంగం జరుగగూడదు. ఇందుకే గదా ప్రొఫెసర్ బన్సాలి 63రోజులు ఉపవాసం చీమూరు మానభంగం కేసులో చేసింది. అయితే స్త్రీ సంపూర్ణ అహింసనుపాటించి తద్వారా మానసికశక్తి సంపాదించుకో గలిగితే అసలు చెరచబడదని గట్టిగా చెప్పవచ్చు. కాని కామేద్రుడురావు కొంటెవాడు. మరి పురుషులు చెరచబడితే

అని అడిగాడు మొన్న. వారికి దేశరక్షణామార్గమని నేను నవ్వా. నువ్వేమంటావు?

**ఉపవాసం అహింస**

ఇలా చెరచబడ్డ స్త్రీ నైతిక పతనం చెందదని మాత్రం ఒప్పుకోవాలి. ఈ నైతికపతనంవల్ల కలిగిన చెడును తీసివేసేశక్తి మానవుల చేతిలో లేదన్నమాట, అంటే సమస్య మానవశక్తికి దాటిపోయినపుడు అన్యుల హృదయపరివర్తనకోసముగాని లేక నైతికపతనానికి శిక్షగాగాని ఈ యుపవాసాయుధం వాడాలి. ఈ శిక్ష నైతికపతనం స్థితినిబట్టి ప్రాణత్యాగంకూడా యుండవచ్చు. ఉదాహరణంగా, సంపర్కించే నైతికపతనం చెందిన స్త్రీ ప్రాణత్యాగం చేయాలి. అలా చేయటంలోనే హిందూమత ప్రాముఖ్యత యుంది నిమిషనిమిషానికి విడాకులిచ్చే పాశ్చాత్య దేశస్థులకు పాఠమది. కాని ఆస్త్రీకి ఇంత సాహసకృత్యాన్ని చేయకపోతే సంఘమేవగించుకోగూడదు. పరిస్థితులు స్వాధీనం తప్పడంవల్ల కలిగిన యీదుర్దశనుచూచి జాలిపడాలి. అయితే ఈ వాదనలన్నీ విన్నపిదప అహింస రెండువిధాలని నీవు తేల్చుకున్నావుగదా! ఒకటి సంపూర్ణంగా మానసికశక్తి గలిగి ఆత్మనిగ్రహం కలిగినవ్యక్తులు వుపయోగించేది. అంటే బలవంతుల అహింస.

**అహింస రెండువిధాలు**

ఇక రెండవది బలవంతుల అహింసకై యత్నం ప్రారంభించబడి తద్వారా మరియు మానసికశక్తిని సంపాదించుకోగలిగిన మధ్యావధిలో

అంటే బలహీనుల దశలో. ఆత్మగౌరవ రక్షణార్థము చేసిన కనీసపు అవసరపుహింస. ఇదే బలహీనుల అహింస. అహింససిద్ధాంతపు సరిహద్దులు. మరి ఇట్టి అహింసా సిద్ధాంతాన్ని సాధించాలంటే సాధనాలేమిటి?

**అహింసా సాధనా మార్గాలు**

రాగద్వేషాల నరికట్టాలి. బ్రహ్మచర్యం పాటించాలి వీటిని సాధించగలందులకై అస్వాదవృత్తి నవలంబించాలి స్వార్థం పోగలందులకై అస్తేయ సిద్ధాంతాన్ని పాటించాలి మరి వీటిని నియమంతప్పకుండా పాటింపజేయాలంటే తత్వంపై ప్రేమ గాని లేక నిర్ణయానికి ద్రోహంచేస్తామనే భయంగాని, పని చేయాలి ఇందులో మానవ బలహీనతలు ప్రేమను బుడింగు మనిపించగలవు. కాని ప్రేమకన్న భయంయుంటే బలహీనతలు ఎక్కువగా పనిచేయజాలవు. అంటే మానవ బలహీనతల రూపుమాపేందుకై భయం యొక మంచి ఆయుధం ఈ ఆయుధం వ్యక్తుల చేతులలో వుందనుకో. ప్రస్తుతంరోజులలో కంట్రోల్ రేటుకు అమ్మాలని శాసనం. అలా చేయకపోతే పోలీసువారు పట్టుకుంటారు. జడ్జి శిక్షిస్తాడు. జైలు ప్రాప్తి అవుతుంది జైలుఅంటే భయంకాబట్టి జైలుకుపోవటానికి భయపడి కంట్రోలుకు మించిన రేటుకు అమ్మడు. కాని ఏ పోలీసువారినో ఏజడ్జీనో కట్టుకొని ఇష్టంవచ్చిన రేటుకు అమ్ముతాడు. అంటే వ్యక్తులద్వారా భయమనే ఆయుధం ఉపయో

గిస్తే వ్యక్తులకు తెలియకుండా వారిని కలుపుకొని అన్యాయాలు చేయవచ్చునన్నమాట. అదేఒకవేళ భగవంతుని ఆయుధంగా వుందనుకో. అంటే మనము లంచము ఈయలేనికలుపోలేనిశక్తి చేతిలోయుంటే మనము దానినుండి దూరముకాలేము అనే భయము కలుగుతుంది. ఆభయమే మనల నక్రమాన్యాయాల చేయనీయదు. ఈరకమైన భయమునకు మరొక పేరు పాపం. ఈ పాపానికి జడిస్తే ఎవరు అన్యాయం చేయరు. కాని పొలంలోయున్న గడ్డిమసిపిని నక్క తెలుసుకుంటే చెఱకు తినకుండా యుంటుందా? అలాగే పాపమనేది అన్యాయాన్ని ఎదిరించేందుకోసం పెట్టబడిన భయమని అందరు తెలుసుకొన్నపిదప దానికి జడుస్తారా? అని నీవు అడుగుతావు. అయితే జైలుకు జడవనివ్యక్తి శాసనాన్ని ఉల్లంఘించడా? కాని ఒకటుంది జైలుచిత్రం బాల్యంలో నరకకూపంలాగా మనయెదుట మనవారు సృష్టించారు. కాబట్టే జైలుకు మనం జడుస్తాం అంటే ఇంటిశిక్షణ పాపంవిషయంలోచేస్తే ప్రపంచంధోరణి మారి అన్యాయాక్రమాలు తగ్గుతాయని అంటావా లేదా? ప్రశ్న. ఆలోచించు.

ఇక రాగద్వేషాలు రెండూకూడా ఒక అతీతశక్తికి భయపడితేనేగాని ఆపుకోలేముగదా! అప్పడిభార్యను సుబ్బడు ప్రేమించాడనుకో. అతనికి తెలియకుండా సుబ్బడు ఆవిడను పొందితే భయంలేదని తెలిసినపుడు అతన్నిమోసగించి ఆవిడను అతను పొందవచ్చు, గాని అదేసుబ్బడు పాపానికి సర్వాం

తర్యామియైన భగవంతునికి భయపడితే అప్పుడిని మోసగిం చినా భగవంతుని మోసగించలేడు. కాబట్టి జారత్వము మానుతాడు.

అంతేగాదు. అప్పుడు సుబ్బడు కొట్లాడారనుకో. అప్పుడు కోపముతో పగసాధించడానికై సుబ్బనిప్రాణం తీస్తానంటు న్నాడు. కాని ఆదేసుబ్బడు నానొసట భగవంతుడు ఈవిధ ముగా వ్రాశాడనుకుంటే అప్పడిప్రాణం తీయపూనుకుంటాడా? లేదు తనద్వేషాన్ని బ్రహ్మపై చూపాలి. బ్రహ్మను కొట్ట లేడు. మహాయితే తిట్టుతాడు నాలుకదురద తీరేదాక. పిదప ద్వేషం తనలోనే యిమిడిపోతుంది. అంటే ద్వేష పరి ణామం చెడుగాదన్నమాట. అయితే ఈవాదనల విన్నపిదప నీవు దేవుడున్నాడని ఒప్పుకోవడం మంచిదని నమ్మవచ్చు. నమ్మకపోయి ప్రపంచశాంతికై నీకుమారులకు బోధించవచ్చు. కాని నీహృదయంలో మరొకప్రశ్న రావచ్చు. అదేమంటే కర్మసిద్ధాంతాన్ని నమ్మి దాస్యదేశీయులు అదికూడా తమ కర్మయనీ ఊరుకుంటే? అని. అవును ఈప్రశ్న నిజము. కాని శంకర్! కొంచెమాలోచించు. అసలు ఆస్తికతలో భగవంతు నికితప్ప యెవరికి లొంగవద్దనేది ముఖ్యసూత్రం. భగవంతుని నమ్మినవాడు యీసూత్రానికి విరుద్ధంగా పోగలడా? మరి ఆస్తి కతలోపమేమిటి?

కాబట్టి అహింసావాది దేవుని నమ్మాలి. ఆదేవుడే అనుభవ ప్రపంచంలో సత్యస్వరూపంగా గుర్తించబడాలి ఈలాంటి అహింసావాది పాటించాల్సిన ధర్మములన్ని యీ శ్లోకంలో యున్నాయి.

"అహింసా సత్యమస్తేయో బ్రహ్మచర్యా సంగ్రహో శరీర శ్రమఆస్వాదో సర్వధర్మ సమానత్వో స్వదేశీస్పర్శభావనా హీపకాదశీ సేవాని నమ్రత్వే కృతనిశ్చయేత్॥

| అహింస కళాశాస్త్రము |
|---|

ఇట్టి అహింస ఒక శాస్త్రం. కళగూడా. ఇది కళగాబట్టి రక్తంలో అనువంశికంగా యిమిడ్చ వచ్చు. అంటే శిల్పియొక్క కుమారుడు శిల్పముకు తేలికగా నభ్యసించేవిధంగానే ఆ పని నేర్పుగూడ పుట్టుకతో వచ్చినవిధంగానే అహింసాయోగుని కుమారుడుగూడా అహింసాతత్వ చిహ్నాలు కలిగి కొలది నేర్పుతో పైకి రాగల్గుతాడు.

అహింస ఒక శాస్త్రముగూడా. ఎందుకంటే యీ శాస్త్రాన్ని సాధించాలంటే శిల్పకళకు యున్నట్లుగానే పనిముట్లు, కొలతలు, గుర్తులు, ప్రణాళికలు, నేర్పు, బుద్ధివికాసము, అన్ని అవసరమన్నమాట. ఇంకోమాటలో చెప్పదలచుకుంటే . దీని ఓ, న, మ, లు వేరు. దీన్ని సాధింపదలచిన ప్రతివాడు ఈ ఓ, న, మ, లు తప్పక చదవాలి, అయితే ఒకవిషయములలో

చించు. కమ్మరివాడు వడ్లపని దుస్సాధ్యమంటే తప్పంటే ఏమనాలి. అసలు కమ్మరిపనిని విమర్శించే అధికారము కమ్మరిది. అది తెలియని వడ్లవానికి యుందా? అలాగే సైన్సువాడు ఖగోళ శాస్త్రం తప్పంటే యేమనాలి? అయితే ఖగోళశాస్త్రం తెలియని సైన్సుపండితుడు ఖగోళశాస్త్రాన్ని విమర్శించే అధికారం యుందా? ఏమంటావు? అట్టి అధికారాలు తప్పంటావుగదా! మరి అయితే అహింసాశాస్త్రం దుర్లభమని హింసాశాస్త్రజ్ఞులంటే అహింసాశాస్త్రం తెలియని హింసాశాస్త్రజ్ఞులు అహింసాసిద్ధాంతం తప్పని వాదిస్తే ఏంచేయాలి? వీరు తప్పుమార్గాన పోతున్నారనాలా వద్దా? అవును అనాలి. మరి అలాగే హింసాశాస్త్రాన్ని గురించి ప్రశ్నించే అధికారం అహింసావాదులకు లేదని నీవనవచ్చు నిజమే. కాని ప్రస్తుతం హింసావాదం పరిణామం అందరు చూస్తున్నాముకదా. ఇప్పటికన్నా పరిపక్వదశకు చెందిన హింసాశాస్త్రజ్ఞులు ముందు వస్తారంటావా? వస్తే శాంతి యుంటుందంటావా? ఏమిటి నీవాదనా? ఏమైన హింసాశాస్త్రజ్ఞుల అభివృద్ధి ప్రాపంచిక వినాశనమేకదా? మరి అయితే యిలాంటి అహింసావాదాన్ని ఆచరణలో పెట్టి ప్రబోధంచేస్తూ తాము ఆచరణలో పెట్టుతున్నా యీ మహా వ్యక్తి పేరేమిటి? ఆతనెచటయున్నాడు? ఆగాఖాన్ మందిరం

లోనా? అచటినుంచే అహింసాజ్యోతి కిరణాలు నలుదిక్కులా పోతున్నాయా? ఆవ్యక్తి అంత గొప్పవాడా? ఏమంటావు, శంకర్! ............ నిజమంటున్నావా? గొప్పవాడంటున్నావా? అయితే తప్పక.

ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః.

దివ్యవాణీ పత్రికవారి
శ్రీనివాస ప్రింటింగ్ వర్క్సు,
సికింద్రాబాదు.